సాక్షి అనకాపల్లి

బుధవారం, 27, సెప్టెంబర్, 2023



కార్మికుడి మృతి

8లో

పరవాడ ఫార్మాసిటీలోని కోరి ఆర్గానిక్స్ పరిశ్రమలో ప్రమాదవశాత్తూ కార్మికుడు మృతి చెందాడు. భార్య, బిడ్డలు దిక్కులేనివారయ్యారు.



ఉచిత వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఏయూలో నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరంలో ఆచార్యులు, బోధనేతర సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.

మోస్తరు వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల ఐదురోజులు ఓ మోస్తరు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న 21, 28న 15, 29న 6, 30న 12, అక్టోబర్ 1న 21 మి.మీ. వర్షపాతం, 32.7 నుంచి 33.4 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

మరింత పకడ్బందీగా ఈ-క్రాప్

- సాంకేతిక సమస్యలకు తావు లేకుండా..
- నూరు శాతం నమోదే లక్ష్యం
- క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ఈకేవైసీ నమోదు
- జిల్లాలో 2.36 లక్షల ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు లక్ష్యం



ఈ క్రాప్ బుకింగ్ పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: ఈ-పంట నమోదులో మరిన్ని సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి సాంకేతిక సమస్యలకు తావు లేకుండా పకడ్బందీగా నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ల పరిధిలో అన్ని మండలాల్లో ఇప్పటికే ఈ-క్రాప్ నమోదు జోరుగా సాగుతోంది. సున్నా వడ్డీ పంట రుణాలతోపాటు పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట కొనుగోలుకు ఈ-పంట నమోదే ప్రామాణికం కావడంతో చిన్నపాటి లోపాలకూ ఆస్కారం లేని రీతిలో నూటికి నూరు శాతం ఈ-పంట నమోదు చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ముందడుగు వేస్తోంది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి చేసి సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ఈ-పంట జాబితాలను ప్రదర్శిస్తారు. అభ్యంతరాల పరిశీలన తర్వాత తుది జాబితాలను ప్రకటిస్తారు.

క్షేత్ర స్థాయి పరిశీలన

నూరు శాతం ఈ-క్రాప్ నమోదు చేస్తున్నప్పటికీ ఈకేవైసీ నమోదులో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా జాయింట్ అజమాయిషీ కింద ఈ-పంట నమోదు చేస్తున్నారు. ఇందుకోసం నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సౌజన్యంతో ప్రత్యేకంగా యాప్‌ను డిజైన్ చేశారు. వెబ్‌ల్యాండ్, సీసీఆర్సీ (పంటసాగు హక్కు పత్రం) డేటాతో అనుసంధానించిన యాప్‌లో రైతు ఆధార్ నంబర్ కొట్టగానే అతని పేరిట ఏయే సర్వే నెంబర్లలో ఎంత విస్తీర్ణంలో వ్యవసాయ, కౌలు భూములున్నాయో తెలిసిపోతుంది. తొలుత ఆధార్, వన్ బీ, జాతీయ చెల్లింపుల సహకార సంస్థ (ఎన్‌పీసీఐ), ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్ నెంబర్, సీసీఆర్సీ కార్డుల వివరాలను ఈ యాప్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, సర్వే సహాయకులతో కలిసి ప్రతిరోజు కనీసం 50 ఎకరాలకు తక్కువ కాకుండా క్షేత్రస్థాయి పరిశీలనకు చేస్తారు. యాప్‌లో నమోదైన వివరాలను క్షేత్రస్థాయిలో సరిపోల్చుకుని అంతా ఒకే అనుకుంటే జియో కోఆర్డినేట్స్‌తో సహా పంట ఫొటోను తీసి అప్‌లోడ్ చేస్తారు. గిరిజన సంక్షేమ శాఖకు చెందిన గిరి భూమి వెబ్‌సైట్‌తో అనుసంధానం చేసి.. గిరిజనులు సాగు చేసే పంటల వివరాలు కూడా పక్కాగా ఈ-క్రాప్‌లో నమోదు చేసేందుకు వెసులుబాటు కల్పించారు. సీసీఆర్సీ కలిగిన రైతులతోపాటు ఆ కార్డుల్లేని రైతుల వివరాలను నమోదు చేసేలా యాప్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

శరవేగంగా ఈ క్రాప్ ప్రక్రియ



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెలాఖరు నాటికి ఈ క్రాప్ బుకింగ్ పూర్తయ్యేలా శరవేగంగా చర్యలు చేపడుతున్నాం. లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకుంటాం. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారి పరిశీలన తర్వాతే ఈ క్రాప్ నమోదు చేస్తున్నాం. దాదాపుగా పూర్తయింది. రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి.

– మోహన్‌రావు, వ్యవసాయ శాఖ జేడీ

జిల్లాలో వివరాలు ఇలా..

- ఈ కర్షక్ యాప్‌లో 3,07,382 ఎకరాలు నమోదు కాగా.. ఇప్పటి వరకు 2,35,906 ఎకరాల్లో (అగ్రికల్చర్ లక్షా 21 వేల 870 ఎకరాలు, హార్టికల్చర్ లక్షా 14 వేల 36 ఎకరాలు) సాగు వేశారు. ఈ ఏడాది 2,35,906 ఎకరాల్లో నమోదే లక్ష్యంగా ఈ క్రాప్ ప్రక్రియ ప్రారంభమైంది.
- ఇప్పటివరకూ 1,75,578 ఎకరాల్లో 1,28,310 మంది రైతుల వివరాల నమోదు పూర్తయింది.
- అత్యధికంగా నాతవరం మండలంలో 24,102 ఎకరాలు, నక్కపల్లి మండలంలో 21,319 ఎకరాలు నమోదు చేశారు.
- ఈ కేవైసీ 49,120 ఎకరాల్లో 35,846 మంది రైతులకు పూర్తయింది.

పూర్తి కావచ్చిన ఈ క్రాప్ నమోదు



వాతావరణ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా సాగు చేపట్టిన 4 మండలాలను గుర్తించాం. ఆ మండలాల్లో సాగు నీరు ఉన్నంత వరకు వరి నాట్లు వేసినా.. కొన్ని చోట్ల సాగు ఆలస్యమైంది. మిగతా చోట పూర్తి స్థాయిలో ఈ క్రాప్ బుకింగ్ పూర్తయింది. నాలుగు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని వ్యవసాయ సలహా మండలిలో తీర్మానం చేశాం.

– చిక్కాల రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

ఘనంగా ముగిసిన నవరాత్రి ఉత్సవాలు



ఫలాలు, పుష్పాలు, తమలపాకులతో అలంకరించిన స్వయంభూ విఘ్నేశ్వరస్వామి

చోడవరం: వినాయక నవరాత్రి ఉత్సవాలు చోడవరంలో మంగళవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. కాణిపాకం తర్వాత అంతటి ప్రాచుర్యం కలిగిన స్వయంభూ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు సంబరంగా జరిగాయి. స్వామివారిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. స్వామివారిని వెండి, బంగారు, సుగంధ పుష్పాలతో అలంకరించడంతో కనువిందుగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం పండిత ఆశీర్వచనం, లడ్డూ వేలం నిర్వహించారు. రాత్రికి స్వామివారికి తిరువీధోత్సవం జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన మూషిక వాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టుబోర్డు కమిటీ చైర్మన్ ఉప్పల సతీష్, ఈవో సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పారిశుధ్య కార్మికుడికి రాష్ట్ర స్థాయి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పారిశుధ్య కార్మికుడు శివకుమార్

మాడుగుల: పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో వీరి పాత్ర ఎంతో కీలకమైనది. ఈ నేపథ్యంలో కరోనా సమయంలో మాడుగుల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు తనకు కేటాయించిన పరిధిలో పారిశుధ్యం మెరుగుకు విశేషంగా కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికుడు బొర్రా శివకుమార్‌కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ మేరకు సోమవారం అమరావతి సచివాలయంలో పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి ఉత్తమ పారిశుధ్య కార్మికుడి పురస్కారం అందుకున్నాడు. జిల్లాలోనే ఈ అవార్డు అందుకున్న ఏకైక పారిశుధ్య కార్మికుడు శివకుమార్‌ను మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి చీపురపల్లి నాయుడు మంగళవారం అభినందించారు.

నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా రవిబాబు



నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ కె.కనకారావును బదిలీ చేస్తూ పురపాలకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుత సామర్లకోట మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబును నియమించారు. కనకారావును మంగళగిరి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయమని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు రవిబాబు నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా మూడు నెలలపాటు విధులు నిర్వర్తించారు.

ఢిల్లీలో జీ-20 యూనివర్సిటీ కనెక్ట్‌కు ఏయూ విద్యార్థులు



సదస్సులో పాల్గొన్న ఏయూ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జీ-20 యూనివర్సిటీ కనెక్ట్ ఫినాలే కార్యక్రమంలో ఏయూ నుంచి 22 మంది విద్యార్థులతో కూడిన బృందం పాల్గొంది. ప్రగతి మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజు ఆధ్వర్యంలో వీరంతా భాగస్వాములయ్యారు. ఏయూ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం పట్ల నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తి రాక నేడు

మహారాణిపేట (విశాఖ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ బుధవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 6 గంటలకు తాడిపల్లి నుంచి రోడ్డు మార్గం ద్వారా విశాఖ బయలు దేరుతారు. మధ్యాహ్నం 12.10 గంటలకు విశాఖలోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 5 గంటలకు రుషికొండకు బయలుదేరి.. అక్కడ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. రాత్రి తిరిగి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని బస చేస్తారు. 28న ఉదయం 7 గంటలకు సింహాచలం వెళతారు. అక్కడ స్వామి దర్శనం అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు విజయవాడ బయలుదేరుతారు.

అనంతుని జయంతి రేపు



పద్మనాభం: పద్మనాభం లోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈ నెల 28న అనంత పద్మనాభ స్వామి జయంతి జరగనుంది. ఇందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నాలుగు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలుపుతారు. ఐదు గంటలకు పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూమి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను వేద పండితులు వేదిక వద్దకు తీసుకువస్తారు. ఉదయం 6.30 గంటలకు, ఉదయం 10 గంటలకు రెండు విడతల్లో వ్రతాలు జరుగుతాయి. గిరిపై వెలసిన అనంతుని ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తారు.

సేవల్లో నంబర్ వన్



రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి

- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి అరుదైన గుర్తింపు
- మరోసారి దక్కిన కాయకల్ప అవార్డు
- రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం

నర్సీపట్నం: ఉత్తమ సేవలు అందించడంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మరోసారి సత్తా చాటింది. రాష్ట్రస్థాయిలో కాయకల్ప అవార్డుకు ఎంపికైన ఆస్పత్రుల్లో నంబర్ వన్‌గా నిలిచింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో దేశంలోని ప్రభుత్వ ఆస్పత్రుల మధ్య పోటీతత్వం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కాయకల్ప అవార్డులను ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర వైద్య బృందాలు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని మూడు పర్యాయాలు సందర్శించి, పనితీరును బేరీజు వేసి 2022-23 సంవత్సరానికి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేశాయి. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య, ఓపీ రోగుల సంఖ్యతోపాటు ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరును ప్రామాణికంగా తీసుకొని ఎంపిక చేస్తారు. 2017-18, 2018-19లో ఆస్పత్రికి కాయకల్ప అవార్డు లభించింది. కరోనా సమయంలో పోటీలు నిర్వహించలేదు. 2022-23 సంవత్సరానికి నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో 13 ఆస్పత్రులు కాయకల్ప అవార్డుకు ఎంపిక కాగా, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో పురస్కారం పొందిన ఏకైక ఆస్పత్రిగా నిలిచింది. కాయకల్ప అవార్డు ద్వారా ఆస్పత్రికి మరిన్ని నిధులు రానున్నాయి. ఈ నిధులతో ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

వైద్యులు, సిబ్బంది కృషి ఫలితమే...



రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా ఆస్పత్రి నిలవటం వెనుక వైద్యులు, వైద్య సిబ్బంది కృషి ఎంతో ఉంది. అందరి కృషితోనే రాష్ట్రస్థాయిలో కాయకల్ప అవార్డు వరించింది. అవార్డు మాపై మరింత బాధ్యతను పెంచింది. ఈ స్ఫూర్తితో వచ్చే ఏడాది దేశస్థాయిలో అవార్డుకు కృషి చేస్తాం. అవార్డు వల్ల ఆస్పత్రికి సమకూరే నిధులతో మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తాం.

–డా.నీలవేణిదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్

కేంద్ర ఉక్కు సహాయ మంత్రి పర్యటన రద్దు

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే స్టీల్‌ప్లాంట్ పర్యటన రద్దయింది. షెడ్యూల్ ప్రకారం ఆయన మంగళవారం విజయవాడ నుంచి సాయంత్రం 4.30 గంటలకు స్టీల్‌ప్లాంట్ రావాల్సి ఉంది. కేంద్ర మంత్రి పర్యటనను అడ్డుకునేందుకు ఉక్కు పోరాట కమిటీ సిద్ధమైంది. నాయకులు ఆయా కార్మిక సంఘాల కార్యకర్తలను పెద్ద ఎత్తున హిల్‌టాప్ కూడలికి రావాలని పిలుపు నిచ్చారు. ఇటీవల కేంద్ర ఉక్కు కార్యదర్శి నరేంద్రనాథ్ సిన్హా స్టీల్‌ప్లాంట్ పర్యటనలో జరిగిన రగడ నేపథ్యంలో పోలీసు అధికారులు, ఉక్కు యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చించారు. ఎట్టకేలకు కేంద్ర పర్యటన రద్దయినట్టు యాజమాన్య వర్గాలు ప్రకటించాయి. దీంతో కార్మికులు హిల్‌టాప్ కూడలి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, డి.వి.రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకన్న ఉంగరం చోరీ!



స్వామివారి ఉంగరం దొంగతనంపై భక్తులను నిలదీస్తున్న అర్చకులు



స్వామి ధరించిన వస్త్రాల్లో ఉన్న ఉంగరాన్ని తీస్తున్న ప్రధానార్చకుడు

- ఆలయానికి వచ్చిన భక్తులు, సిబ్బందిపై అనుమానం
- అర్చకులు నిలదీయడంతో భక్తుల్లో భయాందోళన
- అత్యంత వేడుకగా స్వామివారి వినోదోత్సవం

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది ఘనంగా జరుగుతున్నాయనుకున్న తరుణంలో చివరి రోజైన మంగళవారం కలకలం రేగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపురోజు పసిడి అంగుళీయకం(బంగారు ఉంగరం) మాయం కావడంతో ఆలయ అధికారులు, భక్తులు తీవ్ర ఆందోళన చెందారు. మొదట ఆలయ అర్చకులు చేతివాటం ఉందని పలువురు భక్తులు అభిప్రాయపడగా, స్వామినే నమ్ముకుని సేవిస్తున్న తామెందుకు ఆ పని చేస్తామని అర్చకులు తెలిపారు. అయితే ఎక్కడనుంచో వచ్చి ఆలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి గురవయ్యపై అర్చకులు అనుమానం వ్యక్తం చేసి అతన్ని విచారించారు. దీంతో ఆయన హడలెత్తిపోయారు. పంతులు గారు ప్రసాదం పెడితే తింటాను తప్ప, దేవుడి ఉంగరం ఎందుకు దొంగిలిస్తానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో స్వామివారి ఉత్సవాలు తిలకించేందుకు వచ్చిన కొందరు భక్తుల కదలికలు అనుమానంగా ఉండటంతో వారిని సిబ్బంది నిలదీశారు. దీంతో భక్తులు కన్నీటి పర్యంతమయ్యారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకుంటే పుణ్యం వస్తుందన్న ఉద్దేశ్యంతో వస్తే దొంగతనం అంటగడతారా అంటూ భక్తులు ఆక్షేపించారు. ఈ లోగా ప్రధానార్చకులు గొట్టుముక్కల వచ్చి స్వామివారి ఉంగరం ఆయన ధరించిన వస్త్రాల్లోనే ఉందని చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక క్షేత్రంలో జరిగే వినోదోత్సవం గురించి తెలిసిన వారికి ఈ తంతు ఆద్యంతం అలరించింది. స్వామివారు మృగవేటకు వెళ్లిన సందర్భంలో అత్తవారిచ్చిన ఉంగరం పారేయడంతో అమ్మవారు స్వామివారిని నిలదీస్తారు. ఉంగరం తెస్తేనే గర్భాలయ ప్రవేశం ఉంటుందని అమ్మవార్లు చెప్పడంతో, ముసుగులో స్వామివారు ఉంగరం వెతికేందుకు వెళ్తారు. దీన్నే వినోదోత్సవంగా పేర్కొంటారు. అంతకు ముందు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, నిత్యార్చనలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు, వేణుగోపాల స్వామికి, అండాళమ్మవారికి పూజలు జరిపారు. గ్రామ బలిహరణలు, కంకణ విసర్జన కార్యక్రమాలు పూర్తిచేశారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లేనని ప్రధానార్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకటశేషాచార్యులు, బాగవతం రాజగోపాలాచార్యులు, నందూరి గోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు



దివ్యాంగుల సహాయక ఉపకరణాల గురించి తయారీ సంస్థ అలింకో ప్రతినిధులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

- శిబిరాల్లో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ లబ్ధి
- దివ్యాంగుల నమోదు శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీ, కలెక్టర్

అనకాపల్లి రూరల్: జిల్లాలో నిర్వహిస్తున్న దివ్యాంగుల ఉపకరణాలు, సహాయక ఉపకరణాల ఉచిత పంపిణీ గుర్తింపు శిబిరాల్లో పేర్లు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేస్తామని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి తెలిపారు. అనకాపల్లిలోనే 2 వేల మంది దివ్యాంగులను గుర్తించామని, వారందరికీ ఉపకరణాలను అందిస్తామన్నారు. మంగళవారం కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ఉపకరణాల తయారీ సంస్థ అలింకో సౌజన్యంతో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిర్వహించిన నమోదు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నారు. దివ్యాంగులకు సేవ చేసే అదృష్టం తనకు దక్కినందుకు ఆనందంగా ఉందన్నారు. శిబిరంలో పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ 15 నుంచి 20 రోజుల్లో అవసరమైన ఉపకరణాలు అందిస్తామన్నారు. జిల్లాలో 27న చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గాంధీనగరం)లో, 28న యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, 29న నర్సీపట్నం పెదబొడ్డేపల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో దివ్యాంగుల పేర్ల నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని ప్రత్యేక అవసరాలు గల వారందరూ సద్వినియోగపర్చుకోవాలని కోరారు. అనంతరం అలింకో ప్రతినిధులతో మాట్లాడారు. ఏయే ఉపకరణాలు ఎంత సమయంలో అందిస్తారో అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి శిబిరాన్ని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ అధికారులను ఒప్పించి ఇక్కడ ఏర్పాటు చేయించిన ఎంపీ సత్యవతికి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత పేర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బిస్మరణ్ రాజ్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మిపతి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కె.విష్ణుమూర్తి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఆడారి జగదీష్, సకలా గోవింద్, అనకాపల్లి, కశింకోట, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో శరవేగంగా పునరుద్ధరణ పనులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ మంగళవారం వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ముందుగా కేకే లైన్లో ఇటీవల కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని ఆయన వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు 20కంటే ఎక్కువ అధిక సామర్థ్యం గల ఎర్త్‌మూవర్స్, పొక్లెయినర్స్, ఇతర మెషినరీని వినియోగిస్తూ 400మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ ప్రాంతంలో ట్రాక్‌లపై సుమారు 10వేల క్యూబిక్ మీటర్స్ మట్టి వచ్చి చేరిందని, ఇప్పటికే సుమారు 8వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించినట్లు అధికారులు తెలిపారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నా పనులు కొనసాగిస్తున్నట్లు డీఆర్ఎం వివరించారు. సంఘటన స్థలంలోనే ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్‌లకు చెందిన వివిధ విభాగాధిపతులతో, సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్కడ జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేసారు.

కేకే లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన కొండచరియలను తొలగిస్తున్న నేపథ్యంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు బుధవారం కూడా గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. రూర్కెలా-జగదల్‌పూర్(18107) ఎక్స్‌ప్రెస్ మంగళవారం కోరాపుట్ వరకు నడిచింది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్ బుధవారం కోరాపుట్ నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది. భువనేశ్వర్-జగదల్‌పూర్(18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం కోరాపుట్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్(18448) ఎక్స్‌ప్రెస్ బుధవారం కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం కోరాపుట్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ బుధవారం కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ బుధవారం అరకు వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ బుధవారం అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

క్లుప్తంగా

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి ఆత్మహత్య


మృతుడు ఆవుగడ్డ గంగాధరరావు

చోడవరం రూరల్: అనారోగ్యం కారణంగా ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు కథనం మేరకు స్థానిక కో ఆపరేటివ్ కాలనీలో నివసిస్తున్న ఆవుగడ్డ గంగాధరరావు హుకుంపేట మండలం పాటకడవ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. మంగళవారం ఆయన తన ఇంటిలోని సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు భార్య కసిరెడ్డి యమున చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన గత కొన్నేళ్లుగా బీపీ, సుగర్‌తో బాధపడుతున్నారని, వాటితో పాటు ఆస్తమా కూడా వేధిస్తుండటంతో మానసికంగా కుంగిపోయి, అదే బాధలో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఏ.సూర్యనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇద్దరు మహిళలకు పాముకాట్లు


పాముకాటుకు గురైన మహిళను 108లో నర్సీపట్నం తరలిస్తున్న దృశ్యం


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మహిళ

కోటవురట్ల : మండలంలోని రెండు వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలు పాముకాటుకు గురయ్యారు. వెంటనే వారిని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. రాజుపేటకు చెందిన మళ్ల లీలమ్మ పొలంలో పనిచేస్తుండగా కాలిపై పాము కాటు వేసింది. వెంటనే ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించగా శ్వాస సమస్యతో ఇబ్బంది పడుతుండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో మహిళ సుంకపూరు గ్రామానికి చెందిన శింగంపల్లి సోమరాజు పొలానికి వెళ్తూ కాలువ దాటుతుండగా పాము కాటేసింది. ఆమెను సీహెచ్‌సీకి తరలించగా యాంటీ స్నేక్ వీనమ్ ఇచ్చి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరికీ ప్రాణాపాయం తప్పినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.

కోరీ ఆర్గానిక్స్ పరిశ్రమలో కార్మికుడి మృతి

పరవాడ : జేఎన్ ఫార్మాసిటీలో కోరీ ఆర్గానిక్స్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంలో చోడవరం మండలం కన్నమ్మపాలెం గ్రామానికి చెందిన కింతాడ రాజారావు(37) మృతి చెందినట్టు పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కన్నంపాలేనికి చెందిన రాజారావు పదేళ్ల నుంచి కోరీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం విధులకు వచ్చిన రాజారావు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కొత్త బ్యాచ్ వేయడానికి రియాక్టర్‌ను శుభ్రం చేయడానికి రోప్ సహాయంతో రియాక్టర్ లోపలికి దిగాడు. రియాక్టర్‌ను శుభ్రం చేసి బయటకు వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి రియాక్టర్ లోపల అమర్చిన బ్లేడ్లపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న తోటి కార్మికులు ప్రమాదాన్ని గుర్తించి రాజారావును ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజారావు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు. ఘటన స్థలాన్ని పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కోరీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి మృతుడి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఘటన స్థలాన్ని పరవాడ ఎస్‌ఐ మల్లేశ్వరరావు సందర్శించారు.



కింతాడ రాజారావు (ఫైల్) కన్నంపాలెంలో ఇంటి వద్ద రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

డ్యూటీకి వెళ్లనంటూనే మృత్యు ఒడిలోకి...

చోడవరం రూరల్ : 'రాజారావు ఈ రోజు విధులకు వెళ్లనని, కన్నంపాలెంలోని సొంతింటి నిర్మాణ పనుల నిమిత్తం స్వగ్రామానికి వస్తానని మాతో సోమవారం రాత్రే చెప్పాడు బాబూ... అంటూ మృతుని తల్లి కింతాడ రమణమ్మ బావురుమంది. తన అన్న ఇంటికి వస్తాడని చూస్తుండగా ఈ ఘోరం చెవిన పడిందంటూ అతని చెల్లి వై.నాగమణి కన్నీటి పర్యంతమైంది. అంతలోనే పరవాడ నుంచి తన ఇద్దరు పిల్లలతో వచ్చిన మృతుని భార్య వెంకటలక్ష్మి అత్తయ్యా... అంటూ తన పిల్లలతో సహా ఒడిలో చేరి విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. డ్యూటీకి వెళ్లనంటూనే జనరల్ షిఫ్టు చేసి వస్తానని చెప్పారని, అయితే మధ్యాహ్నం తమ పొరుగున ఉండే కన్నంపాలెం వాసి వచ్చి తన భర్తకు బాగాలేదని చెప్పి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందారంటూ భార్య రోధించింది.

కన్నంపాలెం కన్నీటిపర్యంతం

తమ గ్రామానికి చెందిన రాజారావు మృతి వార్తతో కన్నంపాలెం గ్రామం కన్నీటి పర్యంతమైంది. పొట్టకూటి కోసం గ్రామాంతరం వెళ్లిన రాజారావు విధి నిర్వహణలో ప్రమాదానికి గురి కావడం గ్రామస్తులను, బంధువులను కలచివేసింది. మృతుడి భార్య వెంకటలక్ష్మి, ఏడేళ్ల కొడుకు పూర్ణ చంద్రరావు, ఐదేళ్ల కుమార్తె హర్షిణిలకు దిక్కెవరంటూ తల్లడిల్లారు. మృతుడు రాజారావే తల్లి రమణమ్మ, తండ్రి రాముతోపాటు తన ఇద్దరు చెల్లెల్లకు పెద్ద దిక్కని, ఇపుడు వారంతా దిక్కులేని వారయ్యారని వాపోయారు.

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష

- పైలట్ హెల్త్ క్యాంప్‌ను పరిశీలించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి రూరల్: ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పూర్తయిన గ్రామాల్లో మెగా వైద్య శిబిరాలను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఒకచోట ట్రయల్ రన్ చేపట్టాలని ఆదేశించింది. దీంతో అనకాపల్లి మండలంలోని మామిడిపాలెం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం విద్య ఆరోగ్య శాఖ పైలట్ హెల్త్ క్యాంప్ నిర్వహించింది. ఈ శిబిరంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో హేమంత్ వైద్య శిబిరాల ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. ప్రతి శిబిరంలో 105 రకాల మందులు, ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుమారు 300 నుంచి 500 మంది శిబిరానికి తరలి వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని, వైద్య శిబిరాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. శిబిరంలో ఏర్పాట్లపై కలెక్టర్‌తో పాటు రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ దేవి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఇతర ప్రజా ప్రతినిధులు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జగనన్న సురక్ష తరహాలోనే ఆరోగ్య సురక్ష కూడా నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ప్రజలంతా ఈ బృహత్తర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వైద్య శిబిరం ఏర్పాట్లపై కలెక్టర్‌కు వివరిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

342 మందికి ఆరోగ్య పరీక్షలు

మామిడిపాలెంలో ఆరోగ్య సురక్ష సర్వేలో 412 మందికి టోకెన్లు జారీ చేయగా పైలట్ హెల్త్ క్యాంప్‌కు 342 మంది హాజరయ్యారు. వీరికి బీపీ, ఆర్‌బీఎస్, హెచ్‌బీ, యూరిన్, స్పూటమ్, మలేరియా, డెంగీ, ఆఫ్తాల్మిక్ పరీక్షలు నిర్వహించారు. 15 మందికి కంటి అద్దాలు అవసరమని, మరో ముగ్గురికి నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. వైద్యులు బి.మంజూష, ఎస్ నస్రత్ షమీమ్, ఎం.మానస, అస్మా అక్తర్, డి.సోమేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ వీర జ్యోతి, డాక్టర్లు జి.పావని, జి.రమ, మామిడిపాలెం గ్రామ సర్పంచ్ పి.పరదేశి నాయుడు, ఏఎన్‌ఎంలు, ఎంపీహెచ్‌ఈవోలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఆశా వర్కర్లు, ఆరోగ్యమిత్రలు, 104, 108 సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌ఎం పథకంతో బహుళ ప్రయోజనాలు

- రైతులకు సబ్సిడీపై రుణాల మంజూరు
- స్మైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సింహాచలం

ఆరిలోవ: ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని స్మైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలం తెలిపారు. జిల్లా పశు సంవర్థక శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకంలో భాగంగా రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 368 మంది రైతులు పాల్గొన్న ఈ సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎల్ఎం కింద గొర్రెలు–మేకలు, నాటు కోళ్లు, పందుల పెంపకందార్లతో పాటు పాడి రైతులు పశుదాణా ఉత్పత్తి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామ స్థాయిలో రైతులకు వ్యాపార సరళిలో ఎన్ఎల్ఎం పథకం ఎంతో మేలు చేకూర్చుతుందన్నారు. ఈ పథకం కింద ప్రాజెక్టు ఏర్పాటు కోసం ముందుకొచ్చిన రైతులకు 50 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను కూడా సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్ఎల్ఎం పథకం లక్ష్యాల గురించి రైతులకు వివరించారు.


సదస్సులో పాల్గొన్న రైతులు


ఔత్సాహిక రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్మైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

అనంతరం రైతులకు పలువురు అధికారులు బ్యాచ్‌ల వారీగా అవగాహన కల్పించారు. ఎన్ఎల్ఎం పథకం కోసం లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం, ఎంత సబ్సిడీ లభిస్తుంది తదితర వాటి గురించి వివరించారు. ఉప సంచాలకుడు డాక్టర్ కె.కరుణాకరరావు, డీసీబీసీయూ జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్, డాక్టర్ ఎం.ప్రసాదరావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.శ్రీనుబాబు పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దాం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాథం

నర్సీపట్నం/పాయకరావుపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం పేర్కొన్నారు. ఈ నెల 20న విశాఖలో ప్రారంభమైన సీపీఎం ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ బైక్‌యాత్ర మంగళవారం నర్సీపట్నం, అనంతరం పాయకరావుపేట చేరుకుంది. ఈ యాత్రకు స్థానిక సీపీఎం నాయకులు ఘన స్వాగతం పలికారు. నర్సీపట్నం అబిద్‌సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ, ఉత్తరాంధ్రలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయాన్ని ఉత్తరాంధ్ర ప్రజలు సహించలేదన్నారు. 32 మంది ప్రాణ త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ వచ్చిందన్నారు. అమ్మడం సాధ్యం కాకపోతే మూసివేస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రులు బెదిరింపులకు పూనుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సంస్థను కాపాడుకోవడం ద్వారానే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోగలమన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షకు సీపీఎం చేపట్టిన బైక్‌యాత్రకు ప్రజలంతా మద్దతు తెలిపి పరిరక్షణకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా నాయకులు ఆర్.శంకరరావు, అడిగర్ల రాజు, సాపిరెడ్డి నారాయణమూర్తి ఈరెల్లి చిరంజీవి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి పాల్గొన్నారు.


యాత్రను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం

గౌరీపట్నం భూముల రీ సర్వేలో లోపాలపై విచారణ

- కలెక్టర్ చొరవతో క్షేత్రస్థాయిలో రైతులను విచారించిన బృందం

చోడవరం: మండలంలో గౌరీపట్నం భూముల రీ సర్వేలో లోపాలపై అధికారుల బృందం మంగళవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది. స్థానిక రెవెన్యూ అధికారులు తమ భూముల రీసర్వేను సరిగ్గా చేయలేదని గ్రామానికి చెందిన రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్పందించి రెవెన్యూ, సర్వే అధికారులతో కూడిన బృందాన్ని గ్రామానికి పంపారు. జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డు ఆఫీసర్ ఎస్.గోపాలరాజా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వెంకన్న, స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ ప్రసాదరావు తోపాటు చోడవరం తహసీల్దార్ తిరుమలబాబు ఈ బృందంలో ఉన్నారు. ఈ మేరకు రైతుల వివరాలు, గతంలో రీసర్వే చేసిన తీరు, అధికారుల నిర్లక్ష్యంపై రైతులను ఈ బృందం అడిగి తెలుసుకుంది. క్షేత్రస్థాయిలో భూముల వద్దకు వెళ్లి రైతుల దగ్గర రికార్డులను పరిశీలించింది. గౌరీపట్నం రెవెన్యూ పరిధిలో 4258 ల్యాండ్ పార్స్ మ్యాప్స్ ఉండగా, 278 సర్వే నంబర్లలో 1691ఎకరాల 94 సెంట్లు భూమి ఉంది. ఇందులో 68 మంది రైతులకు చెందిన 49 ఎకరాల 75 సెంట్ల భూమి రీసర్వేలో లోపాలు చోటుచేసుకున్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు అధికారుల బృందం తెలిపింది. గ్రామంలో భూముల రీ సర్వేను తిరిగి చేసేందుకు సర్వేయర్లు, వీఆర్వోలతో కూడిన ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ తిరుమల బాబు చెప్పారు.


గౌరీపట్నంలో రైతులతో మాట్లాడుతూ రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

వీఆర్వో, సర్వేయర్‌పై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు

గౌరీపట్నంలో భూముల రీసర్వేలో వీఆర్వో, సచివాలయ సర్వేయరు పూర్తిగా నిర్లక్ష్యం వహించినట్టు విచారణకు వచ్చిన అధికారుల బృందం నిర్ధారించినట్టు తెలిసింది. వీరిద్దరూ రైతుల రికార్డులు, అభ్యంతరాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా రీ సర్వే చేసినట్టు గుర్తించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీరిపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనుంది. దీంతో శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

ముందుకొస్తున్న దాతలు


రూ.10 వేలు అందజేస్తున్న గ్రౌండ్‌బాయ్స్ కుర్రాళ్లు


రూ.5 వేలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు రాజేంద్రకుమార్

- ప్రమాద బాధితునికి పలువురి ఆర్థిక సాయం
- సాక్షి కథనానికి విశేష స్పందన

రావికమతం: వ్యాన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మంచం పట్టిన కొత్తకోటకు చెందిన పడమటి శ్రీనివాసరావుపై 'అనుకోని ప్రమాదం అంతులేని ఆవేదన' శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించారు. ఆర్థిక సాయం అందించడానికి గ్రామ వలంటీర్లు, స్నేహితులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, మిత్రులు ఎంతో మంది ముందుకు వచ్చారు. ఈ మేరకు స్థానిక గ్రౌండ్ బాయ్స్ కుర్రాళ్లు రూ.10 వేలు, ఇంగ్లిషు ఉపాధ్యాయుడు రాజేంద్రకుమార్ రూ.5 వేలు మంగళవారం శ్రీనివాసరావు కుటుంబానికి అందించారు. అతడి తల్లి సైతం హృద్రోగ సంబంధిత సమస్యతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో వృద్ధ తండ్రి దిక్కుతోచని స్థితిలో ఉండటం పలువురిని కలచివేసింది.

సమాజాభివృద్ధిలో మీడియా కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లిటౌన్: సమాజాభివృద్ధికి పత్రికలు, టీవీలు ఇతర సామాజిక మాధ్యమాలు తగిన ప్రోత్సాహం అందించాలని జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో మంగళవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, జిల్లా ఎస్పీ మురళీకృష్ణతో కలిసి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వం అందించే అభివృద్ధి సంక్షేమ ఫలాలను అర్హులందరికీ చేరవేసేందుకు దర్పణంలా పని చేయాలన్నారు. వివిధ పత్రికలలో ప్రచురించే అంశాలు జిల్లా యంత్రాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. ఎంపీ బి.వి.సత్యవతి మాట్లాడుతూ పత్రికలు, ప్రసార మాధ్యమాలు సమాజాభివృద్ధికి తోడ్పడుతూ అందరికీ దిశానిర్దేశం చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ మీడియా రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాడి విద్యాసంస్థల అధినేత దాడి రత్నాకర్, రాష్ట్ర సాంస్కృతిక కళల కమిషన్ క్రియేటివ్ హెడ్ ఎల్.జోగినాయుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, సంఘ సేవకుడు ముత్యాల రాజేష్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు డి.సోమసుందరరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


కబడ్డీ పోటీల్లో బాలికలు


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

మాకవరపాలెం: కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక ఉన్న పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి కబడ్డీపోటీలు నిర్వహించారు. పోటీలను వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి 750 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ పోటీల్లో అండర్–14, అండర్ –17 విభాగంలో బాలురు, బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు.

విజేతలు వీరే..

ఈ కబడ్డీ పోటీల్లో బాలుర సీనియర్ విభాగం నుంచి మాడుగుల విద్యార్థులు ప్రథమ, నర్సీపట్నం ద్వితీయ, సీనియర్ బాలికల నుంచి అరకు ప్రథమ, ద్వితీయ గాజువాక, జూనియర్ బాలుర విభాగం నుంచి అరకు ప్రథమ, ద్వితీయ మాడుగుల, జూనియర్ బాలికల విభాగం నుంచి అరకు ప్రథమ, నర్సీపట్నం విద్యార్థులు ద్వితీయ స్థానాలు సాధించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారిలో వివిధ పాఠశాలల నుంచి 12 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు హరిబాబు, ఎస్ఐ రామకృష్ణారావు, ఎంఈవోలు మూర్తి, లక్ష్మి, పోటీల ఆర్గనైజర్ రవి, పీడీలు పాల్గొన్నారు.

29న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 29న శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్, సుస్వాదీప్ ఆగ్రో సర్వీసెస్, పైనీర్ ఎలాస్టిక్, రవి రేస్(ఇండియన్ ఆయిల్ డీలర్స్), పేటీఎం సర్వీసెస్, రిలయన్స్ ట్రెండ్స్, ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 616 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఈ కంపెనీల్లో ఫ్లోర్ అసోసియేట్, వ్యాన్ డెలివరీ బాయ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, క్యాషియర్, పిక్కర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్ అసోసియేట్స్, వేర్‌హౌస్ అసోసియేట్స్, ప్రింటింగ్ మిషన్ ఆపరేటర్, టీం లీడర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్ తదితర ఉద్యోగాలు భర్తీ చేస్తారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఐటీఐ, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించిన 18–45 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs. gov. in/ లో పేర్లు నమోదు చేసుకుని.. జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర క్రీడా పోటీల్లో వేచలం విద్యార్థినుల ప్రతిభ

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. గుంటూరు జిల్లా ఏఎన్‌యూలో ఈ నెల 21 నుండి 23 వరకు జరిగిన అంతర జిల్లాల క్రీడా పోటీల్లో ఇద్దరు విద్యార్థినులు బ్రాంజ్, సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. అండర్–14 బాలికల విభాగంలో లాంగ్ జంప్‌లో 8వ తరగతి విద్యార్థిని బి.చైతన్య తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను సొంతం చేసుకుంది. అండర్–18 బాలికల విభాగంలో లాంగ్ జంప్‌లో రెడ్డి భారతి ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు వీరికి ప్రత్యేక తర్ఫీదునిచ్చిన పీడీ రావాడ తమ్మునాయుడును స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, స్థానిక హైస్కూల్ హెచ్ఎం దేవుపల్లి నర్సింహమూర్తి ఇతర ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.


రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించిన వేచలం హైస్కూల్ విద్యార్థినులతో పీడీ తమ్మునాయుడు

క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



మండపారాధనలో అర్చకులు, ఆలయ అధికారులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు ఐదోరోజు అత్యంత వేడుకగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయ బేడా మండపంలో స్వామివారికి హోమాలు, సాయంత్రం ఏకోత్తర సహస్ర కలశ స్థాపన, మండపారాధన, అష్టోత్తర శతక స్థాపన జరిపారు. ముందుగా స్వామివారికి అర్చకులు పులఖండం గిరిబాబు, విజయ్‌బాబులు సుప్రభాత సేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, ఈవో ఆదినారాయణ, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు భవనం వార్షికోత్సవం నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక జిల్లా న్యాయస్థానం ఎదురుగా ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు భవనం 22వ వార్షికోత్సవాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు భవన వ్యవస్థాపకుడు పిరట్ల నరసింహమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలుసేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



ఆపరేషన్ రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఉచితంగా 8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 38 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులు కోలుకునేంత వరకు ఆస్పత్రిలో వసతితోపాటు, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, రోగులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

7/జీ బృందావనకాలనీ(మార్నింగ్, సెకండ్‌షో) వారెవ్వా జతగాళ్లు(మధ్యాహ్నం- సాయంత్రం)	రాజా
మార్క్ ఆంటోని	సత్యనారాయణస్క్రీన్-1
కలివీరుడు	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	షిర్డిసాయి
జవాన్	పర్తిసాయి
జవాన్	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	శ్రీసత్య
ఎక్స్‌పెండబుల్స్4	రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 351 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,550	4,570
రెండో రకం	3,970	4,220
మూడోరకం	3,400	4.050

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 73 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-33 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.


గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 427 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 395 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రభుత్వ బడులు.. డిజిటల్ తరగతులు

ప్రభుత్వ బడులంటే గతంలో చాక్‌పీస్‌లకూ అగచాట్లే. ఇపుడు చాక్‌పీస్‌లతో పని లేదు. జగన్ సర్కార్ ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా మార్చేసింది. సౌకర్యాల కల్పనలో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా తీర్చిదిద్దింది. బోధనలోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఫలితంగా పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ల(ఐఎఫ్‌పీ) ద్వారా బోధన సాగుతోంది. తెరపై వస్తున్న పాఠ్యాంశాన్ని విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోగలుగుతున్నారు.

- ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా బోధన
- మండలంలో 15 స్కూళ్లలో అమలు
- బ్లాక్ బోర్డుతో పనిలేకుండా విద్యాబోధన
- పాఠం ఈజీగా అర్థమవుతోంది : విద్యార్థులు



ఐఎఫ్‌పీ ద్వారా జీవశాస్త్రం బొమ్మలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

అనకాపల్లి రూరల్: పిల్లలకు మౌఖికంగా ఓ విషయాన్ని చెప్పినపుడు పూర్తిగా గుర్తు పెట్టుకోవడం కాస్త కష్టం. అదే టీవీలో చూపిస్తూ, బోధిస్తే చాలా వరకు గుర్తుంటుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో డిజిటల్ విద్యకు చర్యలు తీసుకుంది. ఇతర రాష్ట్రాల విద్యార్థులతో మన విద్యార్థులు పోటీ పడేలా డిజిటల్ బోధనను అమలులోకి తెచ్చింది.

బోధనలో సాంకేతికత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ బడుల్లో అనేక సౌకర్యాలు కల్పించారు. ఈ నేపథ్యంలోనే తొలుత బ్లాక్ బోర్డులకు బదులుగా గ్రీన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది గ్రీన్ బోర్డుల స్థానంలో ఒక్కొక్కటీ రూ.1.30 లక్షలు విలువైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ)లను, స్మార్ట్ టీవీలను తీసుకొచ్చింది. ప్రస్తుతం వీటి ద్వారానే ప్రభుత్వ బడుల్లో బోధన జరుగుతోంది. ప్రభుత్వ విద్యారంగంలో నవశకానికి నాంది పలుకుతున్న డిజిటల్ విద్య విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చడానికి ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో బోర్డుపై రాయడం, పాఠ్యపుస్తకాలను చేత పట్టుకుని బోధించడం కొంత మంది విద్యార్థుల్ని ఆకట్టుకోని పరిస్థితి. వారిని చదువు వైపు ఆకర్షించడానికి డిజిటల్ విద్య ఎంతగానో ఉపయోగపడుతోంది. స్మార్ట్ టీవీల వినియోగం కోసం పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

సమయం ఆదా.. బోధన అర్థవంతం

ప్రతి పీరియడ్‌కు కేవలం 45 నిమిషాలు మాత్రమే సమయం. గతంలో లెక్కలు, సైన్సు, సోషల్ పాఠ్యాంశాల బోధనలో బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో బొమ్మలు, మ్యాప్‌లు వేసి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించేవారు. ఇవి వేయడానికే దాదాపు 15 నుంచి 20 నిమిషాల సమయం వృథా అయ్యేది. ఇపుడా పరిస్థితి లేదు. క్లిక్ చేసిన వెంటనే వివిధ రంగుల్లో బొమ్మలు ప్రత్యక్షమై బోధన సులభతరం అవుతోంది. విద్యార్థులకు కాస్త కష్టంగా అనిపించే పాఠ్యాంశాలు కూడా దృశ్య విధానం ద్వారా బోధనతో ఎక్కువ కాలం గుర్తుండిపోతుంది.

మండలంలో 3 వేల మందికి డిజిటల్ బోధన

అనకాపల్లి మండలం, పట్టణంలో మొదటి విడతగా మనబడి నాడు-నేడు పథకంలో ఎంపికైన 15 పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. మామిడిపాలెం, సీతానగరం, కూండ్రం, తుమ్మపాల, కె.కొప్పాక జెడ్పీ హైస్కూళ్లు, జీవీఎంసీ ప్రధాన హైస్కూల్, ఎంజీజీహెచ్ఎస్(వార్డు 27), ఎంపీఎల్‌హెచ్ఎస్ గాంధీనగరం, ఎంపీఎల్ హెచ్ఎస్ గవరపాలెం 28వ వార్డు, ఎంపీఎల్‌హెచ్ఎస్ టౌన్ గర్ల్స్ హైస్కూల్, ఎంపీయూపీఎస్ కుంచంగి, బవులువాడ, రాంపురం, శంకరం, ఎరుకువానిపాలెంలలో 99 ఐఎఫ్‌పీలు, 25 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసి బోధనకు వినియోగిస్తున్నారు. వీటి ద్వారా సుమారు 3 వేల మంది విద్యార్థులకు డిజిటల్ బోధన అందుతోందని అధికారులు చెబుతున్నారు.

పాఠాలు ఈజీగా అర్థమవుతున్నాయి



టీవీ ద్వారా పాఠాలు వినడం కొత్తగా ఉంది. డిజిటల్ బోధన ద్వారా చెప్పే పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి. వీడియోలు, బొమ్మల ద్వారా పాఠాలు బోధిస్తుండడంతో ఎక్కువకాలం గుర్తుంటున్నాయి. రోజూ కొత్త అంశాలు, కొత్తగా నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతోంది.

– పి.రోహిణి, 9వ తరగతి, జెడ్పీ హైస్కూల్ తుమ్మపాల

కార్పొరేట్ స్కూల్లో చదువుతున్నట్లుంది



మా స్కూల్లో ఈ మధ్యనే ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. టీచర్లు స్క్రీన్‌పై చెబుతున్న పాఠాలు ఆసక్తిగా ఉంటున్నాయి. బ్లాక్‌బోర్డ్‌పై చాక్‌పీస్‌తో రాసే సమయంలో కొన్ని సందర్భాల్లో అర్థమయ్యేవికావు. ఇపుడా పరిస్థితి లేదు. నిజం చెప్పాలంటే కార్పొరేట్ స్కూల్లో చదువుతున్నట్లుంది.

– పి.అనంతరామకృష్ణ, 9వ తరగతి, జెడ్పీ హైస్కూల్ తుమ్మపాల

బోధన సులభతరం



ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌ల వినియోగంతో బోధన సులభమైంది. విద్యార్థులు ఇంటి వద్ద కూడా ట్యాబ్‌లు ఉపయోగించి పాఠాలు నేర్చుకుంటున్నారు. వీటి వినియోగం వలన బోధన తీరులో కూడా మార్పు వచ్చింది. దృశ్య రూపకంగా చెప్పడం, బొమ్మలు చూపించడంతో విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు. వీటి ఏర్పాటు వలన సమయం కూడా ఆదా అవుతోంది.

– ఎస్.సీతారామచంద్రమూర్తి, గణితం ఉపాధ్యాయుడు

సద్వినియోగం అవుతున్నాయి



మండల పరిధిలో మొత్తం 15 స్కూళ్లలో ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశాం. డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులు ఇప్పటికే శిక్షణ పొందారు. పాఠశాలల్లో వీటి ద్వారా బోధన కూడా జరుగుతోంది. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతోంది. శ్రద్ధగా పాఠాలు వింటున్నారు. దశల వారీగా ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో డిజిటల్ విద్య అమలుకు చర్యలు తీసుకుంటోంది.

– కె.చిట్టిబాబు, ఎంఈవో, అనకాపల్లి

గడప గడపకూ జగనన్న ఆరోగ్య సురక్ష



కశింకోట 4వ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో రక్త పరీక్షలు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మంగళవారం నిర్వహించారు. కశింకోటలోని 1, 3, 4 సచివాలయాలతోపాటు బయ్యవరం, వెదురుపర్తి, జమాదులపాలెం సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ఆరా తీశారు. బీపీ, సుగర్, మలేరియా, డెంగ్యూ, యూరిన్ తదితర పరీక్షలు నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ప్రాథమిక నివేదికల్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారిని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేశారు. ఈ సర్వేలో ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, లోవదుర్గ, ఏఎన్‌ఎంలు శివకుమారి, నిర్మల, దేవుడమ్మ, ఆశ కార్యకర్తలు కనక, ఈశ్వరమ్మ, పార్వతి, రమణమ్మ, నాగ తదితరులు పాల్గొన్నారు.



బయ్యవరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్ఎం శివకుమారి

గణపతి మండపాల్లో ఆధ్యాత్మిక శోభ



వినాయకుని వద్ద దీపారాధన



కశింకోట వద్ద సాయినగర్‌లో వినాయక ఉత్సవాల్లో వృద్ధ దంపతులకు సత్కారం



పెద్ద గుమ్మం వీధిలో వినాయకుని వద్ద భజన చేస్తున్న మహిళలు

కశింకోట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కశింకోట సాయినగర్‌లో 60 ఏళ్ల పైబడిన 15 మంది దంపతులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు యల్లపు రామచంద్రరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండపం వద్ద మహిళలు అందంగా ముగ్గు వేసి దీపాలతో అలంకరించారు. మునగపాకకు చెందిన శరగడం పరదేశినాయుడు భగవద్గీత ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూ ప్రతి ఒక్కరూ భగవద్గీతను పారాయణం చేయడం ద్వారా ఆధ్యాత్మిక చింతనతోపాటు, మానసిక చైతన్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ ప్రతినిధులు వేగి రామకోటేశ్వరరావు, యల్లపు నాయుడు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పెద్ద గుమ్మం వీధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని లింగ దీపార్చన చేశారు. మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. పలు వీధులు, మండల గ్రామాల్లో నవ రాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగుస్తుండటంతో బుధవారం నిమజ్జనోత్సవాలు ఎక్కువగా జరగనున్నాయి. దీంతో కశింకోటలోని గవరపేట, గాడి వీధి, కాశీమదుం గ్రోయిన్ ప్రాంతాల్లోని శారదానదిలో ఎక్కువగా వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేస్తారు. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. మండల గ్రామాల్లో కూడా ఏలేరు కాలువ, శారదానది ప్రాంతం, చెరువుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేశారు.

చురుగ్గా డ్రైనేజీ, రహదారి పనులు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: నాణ్యతలో రాజీలేకుండా రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సంబంధిత కాంట్రాక్టర్‌ను సూచించారు. స్థానిక 82వ వార్డు పరిధి నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధిలో రూ.27 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సమస్యకు తమ ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలు జీవీఎంసీ సిబ్బందికి, కాంట్రాక్టర్‌కు సహకరించాల్సిందిగా కోరారు. 15 రోజుల్లో డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. డ్రైనేజీ పనుల తర్వాత రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ సుమిత్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు కూండ్రపు సత్తిబాబు, ఈతలపాక శివ, కారుకుండి కన్నా యాదవ్, పేలూరు కల్యాణ్, డొంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిల్కారీ సేవలను వినియోగించుకోవాలి



తుమ్మపాల పీహెచ్‌సీలో కిల్కారీ సేవలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఏఎన్‌ఎంలు

అనకాపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కుటుంబ ఆరోగ్య మంత్రిత్వ శాఖ అందుబాటులోకి తెచ్చిన కిల్కారీ సేవలను గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే నస్రత్ షమీమ్ సూచించారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో కిల్కారీ సేవలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తోందన్నారు. వాయిస్ మెసేజ్‌ల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలు వినిపిస్తాయన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు, శిశువుల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటింటికీ వచ్చి ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు వివరిస్తారని తెలిపారు. అంతకుముందు ఏఎన్‌ఎంలు కిల్కారీ సేవలకు సంబంధించిన బ్యానర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో కిల్కారీ మొబైల్ అకాడమీ ప్రోగ్రాం అధికారి ఆర్ మోహనరావు, డాక్టర్ వాణీ జగదీశ్వరి, సీహెచ్‌వో డి.శారద, హెచ్‌వీ ఎం.మరియమ్మ, ఎంపీహెచ్ఎస్ బి.సంగం, పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్బంధంపై సిటు నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ మహిళా నాయకులు

అనకాపల్లి రూరల్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి శాంతియుత నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల నిర్బంధాలు, అరెస్టులను సీఐటీయూ(సిటు) మహిళా నాయకులు ఆక్షేపించారు. ఇందుకు నిరసనగా పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ధర్నా చేశారు. తమకు కనీస వేతనాలు చెల్లించాలన్న డిమాండ్‌తో ర్యాలీ చేస్తే, పోలీసులు తమ గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో తమ పోరాటం మరింత ఉధృతమవుతుందన్నారు. కార్యక్రమంలో వి.సత్యవతి, కె.వరలక్ష్మి, ఇ.పార్వతి, సూర్యకళ, కింతలి లక్ష్మి, సరోజిని పాల్గొన్నారు.

నేడు భారీ అన్న సమారాధన

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానంద నగర్‌లోని ఎంపీ స్వగృహంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రుల మహోత్సవంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన జరపనున్నట్లు వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల విష్ణుమూర్తి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. అన్నసమారాధన అనంతరం వినాయక నిమజ్జనోత్సవం భారీస్థాయిలో జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

కోరీ ఫార్మా ప్రమాదంపై దర్యాప్తు చేయాలి

అనకాపల్లి రూరల్: పరవాడ ఫార్మా పరిశ్రమలోని కోరీ ఆర్గానిక్స్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కోటీశ్వరరావు, ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. పరిశ్రమలో రియాక్టర్ వద్ద జరిగిన ప్రమాదంలో రాజారావు అనే కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడని, మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఫార్మా పరిశ్రమల్లో యాజమాన్యాలు కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే అమాయకులైన కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, అన్ని రకాల ఫార్మా యాజమాన్యాలను అప్రమత్తం చేయాలని కోరారు.

అంబేడ్కర్ మిషన్ ఆత్మీయ సమావేశం నేడు

అనకాపల్లిటౌన్: అంబేడ్కర్ ఇండియన్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ సునీల్(ఐపీఎస్) గురువారం ఉదయం 10 గంటలకు భీమునిగుమ్మం శ్రీనివాస కల్యాణమండపం వద్దకు రానున్నట్లు మిషన్ జిల్లా అధ్యక్షుడు కుంచాల చిన్నదేవుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కల్యాణ మండపంలో నిర్వహించనున్న ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని మిషన్ సభ్యులు అందరూ హాజరుకావాల్సిందిగా కోరారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు



సంపతిపురం రక్షిత తాగునీటి ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని సంపతిపురంలో నిర్మించిన సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా ప్రాజెక్టును గ్రామీణ నీటి సరఫరా విభాగం, ప్రాజెక్టుల విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. నీటి శుద్ధి విధానాన్ని అధికారులు ఆయనకు ప్రత్యక్షంగా చూపించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేసిందన్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఎక్కడికక్కడ తాగునీటిని అందించేందుకు ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్ట్స్ డీఈఈ ఎస్.భారతి, ఏఈఈలు కె.రాహుల్, మహమ్మద్ సయ్యద్, మండల కో ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, నక్కా రమణ, కరణం సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్వని కాలుష్య కారక వాహనాలపై చర్యలు



వాహనదారులతో ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పట్టణ పరిధి పలు ప్రాంతాల్లో మంగళవారం ఎక్కువ సౌండ్ చేస్తున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 మంది వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, ఎక్కువ సౌండ్ వచ్చే సైలెన్సర్లతో వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించి, సైలెన్సర్లను తొలగించినట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

చింతామణి దత్త క్షేత్రంలో లక్ష్మీగణపతి హోమం



చింతామణి గణపతి దత్తక్షేత్రంలో దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: వినాయక నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా స్థానిక గవరపాలెం సంతబయలు పెదరామస్వామి వినాయక మందిరం వద్ద మంగళవారం నిర్వహించిన శ్రీలక్ష్మీగణపతి హోమాన్ని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ప్రారంభించారు. అంతకు ముందు వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జీవీఎంసీ విలీనగ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్త క్షేత్రంలో గణపతిని దర్శించుకున్నారు. ఆయన వెంట 80వ వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కర్, మళ్ల రాజా, బొడ్డేడ శంకరరావు, ఆరుద్ర, కర్రి నారాయణరావు, సాలాపు నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రాయితీపై వీర్య నాళికలు

పరవాడ: కృత్రిమ గర్భధారణ, లింగ నిర్ధారణ వీర్య నాళికలను రాయితీపై అందజేస్తున్నట్లు పరవాడ పశు సంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణకీర్తి తెలిపారు. మండలంలోని పి.బోనంగిలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.రామ్మోహన్‌రావు పర్యవేక్షణలో మంగళవారం ఏర్పాటు చేసిన లేడదూడల ప్రదర్శనను సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ లేగ దూడల పోషణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రదర్శనలో మేలు జాతి, ఆరోగ్యకరమైన లేగదూడలను ఎంపిక చేసి బహుమతులు, మిశ్రమ దాణా, టానిక్, మందులను రైతులకు అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ అశ్వని ప్రఫుల్లా, డాక్టర్ పి.సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.